# జగన్‌ను అభిమానించే ప్రతి ఒక్కరినీ గౌరవించాలి

- వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి
- జగ్గంపేటలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



జగ్గంపేటలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

**జగ్గంపేట:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానించే ప్రతిఒక్కరినీ పార్టీ నేతలు, కార్యకర్తలు గౌరవించాలని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల కో ఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్‌రెడ్డి సూచించారు. జగ్గంపేటలో బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల మంచి అభిప్రాయం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి నేతలు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ కష్టపడి పనిచేసే ఏ ఒక్క ఎమ్మెల్యేను సీఎం వదులుకోరన్నారు. తొలుత మిథున్‌రెడ్డికి జగ్గంపేట శివారు కోనేటి వద్ద మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా ఆధ్వర్యంలోనూ పార్టీనేతలు ఘనస్వాగతం పలికారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, దవులూరి దొరబాబు, జేసీఎస్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

**ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం**

**గండేపల్లి:** ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్స్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అన్నారు. మండలంలోని సూరంపాలెంలో రూ.2.15 కోట్లతో నిర్మించే నూతన పీహెచ్‌సీ భవనానికి బుధవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి నూతన పీహెచ్‌సీని అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, పార్టీ మండలాధ్యక్షులు కందుల చిట్టిబాబు, గ్రామ సర్పంచ్ మారిశెట్టి గంగా భవాని, నాయకంపల్లి సొసైటీ అధ్యక్షురాలు కుంచే వెంకట రత్న కుమారి, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సూరంపాలెంలో నూతన పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మిథున్‌రెడ్డి, పార్టీ నేతలు

**వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక**

**జగ్గంపేట:** గ్రామానికి చెందిన 50 మంది బీసీ నేతలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా సారథ్యంలో పార్టీలో చేరిన వారికి పార్టీ ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని మిథున్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, దవులూరి దొరబాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



జగపతినగరంలో 108 కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

**కిర్లంపూడి:** జగపతినగరంలో అభయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకుడు బాదంపూడి నారాయణమూర్తి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలకు 108 కలశాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

### ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం




పేరవరంలో శ్రమదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

**ఏలేశ్వరం:** మండలంలోని పేరవరంలో బుధవారం ఎన్‌సీసీ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎన్‌సీసీ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. గ్రామంలోని శ్మశాన వాటికలో వ్యర్థాలను తొలగించారు. వీధులను శుభ్రం చేశారు. డ్రైన్లలో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ బేరి వరలక్ష్మి, ఉప సర్పంచ్ కర్రి వీరాస్వామి, అధ్యాపకులు వీరభద్రరావు, బంగార్రాజు, ప్రసాద్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

**ఏలేశ్వరం:** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. భారత రాజ్యాంగం అందించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత విలువలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అరటిలోడు లారీ బోల్తా



హైవేపై రాజులుకొత్తూరు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడిన అరటిలోడు లారీ

**తుని రూరల్:** తుని నుంచి విజయవాడ వైపు వెళుతున్న అరటిలోడు లారీ జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. బుధవారం తెల్లవారుజామున తుని మండలం తేటగుంట శివారు రాజులుకొత్తూరు సమీపంలో లారీ అదుపు తప్పి హైవే పక్కన గుంతలో బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. లారీ క్యాబిన్ ధ్వంసమైంది. అరటి గెలలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్సై ఎ.బాలాజీ తెలిపారు.

### 'కేశాప్రగడ' సంస్మరణ సభ

**కిర్లంపూడి:** స్థానిక సత్యసాయి మందిరంలో బుధవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త కేశాప్రగడ సత్యనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, ఆయన అభిమానులు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ప్రతిఒకరినీ ఆధ్యాత్మికత వైపు మళ్లించిన మహోన్నత వ్యక్తి కేశాప్రగడ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తూము కల్యాణ్, కురుమళ్ల విష్ణు, బాదంపూడి సూరిబాబు, కాళ్ల దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణం

**తొండంగి:** మండలంలోని బెండపూడిలో విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఆలయ పండితులు ఉదయం ఎనిమిది గంటలకు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపిస్తారని చెప్పారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

### వీరవరంలో 'మీ భవిష్యత్-నా బాధ్యత'

**కిర్లంపూడి:** మండలంలోని వీరవరంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం 'మీ భవిష్యత్ -నా బాధ్యత' కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ శ్రేణులతో కలిసి గ్రామంలో ప్రతిఇంటికీ వెళ్లి టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

## కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

**అన్నవరం:** రత్నగిరి తొలి పాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా బుధవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు యనమండ్ర శర్మ, సంతోష్ ఘనపాఠి, ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, ప్రయాగ రాంబాబు, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. నలుగురు భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

## 'ఫ్యామిలీ డాక్టర్'తో పేదలకు మెరుగైన వైద్యం



కత్తిపూడిలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

**శంఖవరం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని డాక్టర్ సత్యసాగర్ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రావికంపాడు పీహెచ్‌సీ వైద్యులు ఇంటింటికీ వెళ్లి 100 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాజకుమారి, హెచ్‌వీ ధనలక్ష్మి, ఎంపీహెచ్‌ఓ రమేష్ కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకు ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శంఖవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



శంఖవరంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

**శంఖవరం:** ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థానిక సచివాయం-2 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్ర లచ్చబాబు, పడాల బుజ్జి, పడాల సతీష్, చింతనీడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలి



రంపయర్రంపాలెంలో నిరసన ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

**గోకవరం:** రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రానికి చెందిన 89 ఎకరాల భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంఘం నాయకులు, సభ్యులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ భూములకు వేలం పాటలు నిర్వహించకుండా దేవదాయశాఖ అధికారులు భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వినతి పత్రాలు అందించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భూములకు వేలం పాటలు నిర్వహించాలని, ఈ భూముల్లో పండిన రూ. లక్షలు విలువ చేసే జీడిపిక్కలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కె.సతీష్, సురేష్, శ్రీకాంత్, గోలి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్చకులు, వ్రతపురోహితులకు శిక్షణ

**అన్నవరం:** రత్నగిరిపై భక్తులకు అర్థమయ్యేలా ఆగమశాస్త్రబద్ధంగా పూజలు, వ్రతాలు నిర్వహించాలని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు సూచించారు. రత్నగిరిపై అర్చకులు, వ్రతపురోహితులకు దేవదాయ, ధర్మాదాయశాఖ అర్చక ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను ఏసీ రమేష్‌బాబు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇతర దేవస్థానాల కన్నా అన్నవరం దేవస్థానంలో వైదిక కార్యక్రమాలు అధికంగా జరుగుతాయన్నారు. పురోహితులు, అర్చకులు పూర్తి స్థాయిలో శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో దేవస్థానం ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, అర్చక ట్రైనింగ్ అకాడమీ కో ఆర్డినేటర్ డీవీఎం చక్రవర్తి, ద్వారకాతిరుమల ఆస్థాన సిద్ధాంతి పైతపల్లి బాలసుబ్రహ్మణ్య శర్మ, దేవదాయశాఖ ఆగమ సలహాదారు చిర్రావూరి శ్రీరామ శర్మ, సత్యదేవుని ఆలయ ప్రధానార్చక కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యంపై కేసు

**జగ్గంపేట:** యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజపూడి గ్రామానికి చెందిన నాగలక్ష్మికి, గంగవరం మండలం పిడతమామిడి గ్రామానికి చెందిన కోట్ల సాయికుమార్‌కు గత మార్చి నెల 9న గౌరీపట్నంలో వివాహం జరిగింది. కాగా ఈ నెల 10న అత్తవారంటికి వచ్చిన సాయి కుమార్ భార్యను తీసుకువెళతానని రెడీగా ఉండమని చెప్పి చెప్పుల కోసం జగ్గంపేట వెళ్లాడు. రెండురోజులు గడిచినా తిరిగి రాకపోవడంతో అతని భార్య నాగలక్ష్మి జగ్గంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం




రౌతులపూడి మార్కెట్ సెంటర్‌లో లారీ ఢీకొని విరిగిపడిన విద్యుత్ స్తంభం

**రౌతులపూడి:** స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని బుధవారం క్వారీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి కింద పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే సెంటర్‌లో విద్యుత్ స్తంభం విరిగి పడడంతో సమీప ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రధాన రహదారుల్లో క్వారీ లారీలు నెమ్మదిలా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

# తూర్పుకాపుల హక్కుల సాధనకు కృషి

**జగ్గంపేట:** తూర్పుకాపుల హక్కుల సాధనకు కృషి చేస్తామని ఏపీటీకేఎస్ఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బద్దుకొండ వెంకటరమణ అన్నారు. స్థానిక కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం తూర్పుకాపుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పుకాపులు కలిసికట్టుగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. తూర్పుకాపుల్లో చైతన్యం కోసం నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జగ్గంపేట పట్టణ కమిటీని కొత్తగా నియిమించారు. సంఘ అధ్యక్షుడిగా కురుమిల్లి శ్రీను, మరో 17 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు తూర్పుకాపు నేతలు పాల్గొన్నారు.

# గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ఎస్.అన్నవరంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరరావు

**తుని రూరల్:** ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు బుధవారం ఆయన పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక నాయకులు కుసనం దొరబాబు, గంటా చక్రరావు, వంగలపూడి జమీలు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



ధర్మవరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

**ప్రత్తిపాడు రూరల్:** ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని ధర్మవరంలో ఫర్నిచర్ వ్యాపారి గోవింద్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గండేపల్లి:** ప్రస్తుత వేసవిలో వాహనదారులు, బాటసారుల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. మల్లేపల్లిలో గ్రామ ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను తన తండ్రి వెంకట్రాజు పేరిట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ బిర్రా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ బత్తుల వరలక్ష్మి పాల్గొన్నారు.

## యంగ్ జీనియస్ అవార్డుకు విద్యార్థిని ఎంపిక



అవార్డుకు ఎంపికైన హంసినిని అభినందిస్తున్న సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి

**తుని:** సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుకు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థిని హంసిని ఎంపికైనట్టు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 4న సుచిరిండియా ఫౌండేషన్ దేశ వ్యాప్తంగా నిర్వహించిన 11వ నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో హంసిని ద్వితీయ స్థానం సాధించి సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుకు ఎంపికైందన్నారు. అవార్డుకు ఎంపికైన హంసినిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు అభినందించారు.

## ఉపాధి హామీ పనులపై సమీక్ష



తునిలో ఉపాధి పనులపై సమీక్షిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

**తుని రూరల్:** ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సూచించారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి ఏపీఓ, టీఏ, ఎఫ్ఏలతో ఆమె ఉపాధి పనులపై సమీక్షించారు. గ్రామాల వారీగా కూలీల హాజరు సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి దినసరి వేతనం పెరిగిందని, రోజువారీ కూలీల సంఖ్య సంఖ్యను పెంచాలన్నారు. పని చేసిన కూలీలందరికీ తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని సూచించారు. ఏపీఓ పశుపులేటి నారాయణ రావు, ఇంజినీరింగ్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బిళ్లనందూరులో మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**గండేపల్లి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో బుధవారం ఆయన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి, ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను, పాల్గొన్నారు.

**కోటనందూరు:** ప్రజా సంక్షేమమే ఊపిరిగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కోరారు. బిళ్లనందూరులో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బొత్స మంగతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగన్ పాలన, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

**గ్రామాల్లో జోరుగా జగనన్నే మా భవిష్యత్**

**ఏలేశ్వరం:** నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని భద్రవరం, యర్రవరం, జె.అన్నవరం తదితర గ్రామాలతో పాటు ఏలేశ్వరం పట్టణంలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ఇంటింటా తిరిగి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. స్థానిక 12వ వార్డులో వైఎస్సార్ సీపీ నేత సామంతుల సూర్యకుమార్, 9వ వార్డులో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వాగు బలరాం ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.